

# పరిహారం

శ్రీ డి. కె. ప్రసాదశాస్త్రి

"జావ్ రే, జావ్!"

ధోరణిచూస్తే కేవలం కసాయి సాహేబులా ఉన్నాడు.

•  •  •

"ఇందులో ఏ ఖాళీ లేదు. మరో దాంట్లో ఎక్కండి."

"ఒక్కణ్ణే. అర్జంటుగా వెళ్లాలి."

"వీల్లేదంటే వినబడదూ?"

స్వంత బండిలాగ దబాయించాడు రాడీ వెధవ!

•  •  •

"ఫో, అప్పా, ఇంగే ఎడమిల్లై."

వెధవ అరవ గోల. అంతకన్న కాకులు నయం.

•  •  •

"సారీ, ప్లీజ్. నో రూమ్."

మిలటరీవాడైనా కాస్తమంచివాడులా కనుపిస్తాడు. బొత్తిగా దన్నులగొడ్డు కాదు.

ఈ విధంగా వెంకటేశం సెంట్రలు స్టేషన్లో కలకత్తాపోయే మెయిలుని ఇంజను దగ్గరనుంచి గార్డు పెట్టెవరకు గాలించేశాడు. గుమ్మందగ్గిరే నిలబడతా నన్నా ఒక్కడూ ఒప్పుకోలేదు. పై వాడికి క్రిందవాడు లోకువ అన్నది మరోసారి ధృవపడింది. ఎంత స్టూడెంటైనా మందవిడిపోవడంవల్ల పప్పు ఉడకటంలేదు. వెళ్ళవలసిన పనా అత్యవసరమైంది. తను కోరుచున్న మేనమామ కూతురుతో వివాహ నిశ్చయం. మొదట్లో తండ్రి వ్యతిరేకించాడు. కాని తన ప్రేరణవల్ల తల్లి సాగించిన సత్యాగ్రహ, నిరశనవ్రతాలతో తండ్రి అభిప్రాయాన్ని మార్చుకోక తప్పిందికాదు. దాని ఫలితమే ఆ సాయంకాలం తన కందిన టెలిగ్రాఫ్ ఆహ్వానం. వెధవ టెలిగ్రాం, ఒక్క గంట ఆలస్యంగా అందింది. ఫోన్లో మాట్లాడి

ఉంటే ఈపాటికి బెజవాడలో ఏ సినిమా హాల్లోనో శారద సరసను కూర్చుని......

ఇంతకూ ప్రయాణం విషయం? వ్యవధి ఒక పావు గంట మాత్రమే ఉంది. ఒక్క దౌర్భాగ్యుడూ బండిలో అడుగు పెట్టనివ్వడంలేదు. ఈ దద్దమ్మలకే స్వంతరైళ్లుఉంటే దానికేసి అసలు చూడనివ్వరేమో!

"ఏమండీ, పంతులుగారూ, అలా కంగారుగా తిరుగుతున్నారు?" అని ఒక పెట్టెలో మూల తాపీగా కూర్చుని, మాసిన గడ్డాన్ని నిమురుకుంటూ, ఒక వ్యక్తి ప్రశ్నించాడు. బహుశా విరహావస్థలో ఉన్న ఒక భావ కవేమో!

నిండు సూటుతో ఉన్న వెంకటేశం వంటి వ్యక్తి హ్యాట్టొక చేత్తో పట్టుకుని, ప్లాట్‌ఫారంమీద అలా పరుగెడుతూంటే, కారణాన్ని అడిగే వ్యక్తిని ఎంత బుద్ధిహీనుణ్ణిగా భావించాడు వెంకటేశానికి బోధ పడలేదు. రెండు "చకారపు గుళ్లు" ప్రసాదిద్దామనుకున్నాడు. కాని, అవసరం తనది. తొందరపడిలాభంలేదని తమాయించుకొని.

"ఏముందండీ, పెట్టెలో దూరడానికి" అన్నాడు కొంచం వెటకారంగా.

"అంత అవసరమైనా పనాండీ?"

"చిత్తం!" ఇంకా నిరసన భావం పోలేదు.

"............"

"ఏమిటా ఆలోచిస్తున్నారు!"

ఆ తలమాసిన వ్యక్తి పైకి తలెత్తి కాస్త ఆలోచించేసరికి వెంకటేశానికి కొంచం ఆశ కలిగింది, ఏదైనా మార్గం చూబిస్తాడేమోనని. బికారి, తనకు సహాయం చెయ్యడమా? అనూహ్యం! ఏమో, సింహం చిట్టెలుక కథ చదువుకో లేదూ? అంత అనుభవం లేకుండా రాస్తారా కథ, పెద్దవాళ్లు?

"అంత అవసరమైన ప్రయాణమైతే, కాస్త ముందుగా రావచ్చుటండీ?" గొప్ప ప్రశ్న వేశాడు చవట!

"ఆమాత్రం నాకు తెలుసునండి. కాని విధి అలా ఉంది.

"బాగా చెప్పేరు. ఇప్పటివాళ్లకి పురుషకారం అంటూ లేదు. పని అయితే మన ప్రతాపం, కాకపోతే, విధి బలం. ఎందుకో మరి, ఈ పురుష జన్మ! మొత్తానికి దెబ్బకు దెబ్బ తీశాను. ఎవడో ఘటికుడే, చవటరకం కాదు.

ఆ అపరిచితవ్యక్తినోరు, వెలక్కాయ చిప్ప నొక్కినట్లు నొక్కుదామన్నంతకోపం వచ్చింది వెంకటేశానికి. కాని, తన అవసరం ఇలాంటి అవసరాలే ఎంతోమంది పౌరుషవంతుల్ని నొక్కిపెడుతున్నాయి ఈనాడు.

"దానికేం గాని, ఏమైనా ఉపాయం ఉందంటారా?" వలలో చిక్కిన సింహం దీనదృక్కులతో చిట్టెలుకవైపు చూస్తున్న

దృశ్యం జ్ఞప్తికి వచ్చింది వెంకటేశానికి. తల వంచుకున్నాడు.

"మీ ప్రయాణం అత్యవసరమని చేతిలో చెయ్యి వేస్తే, కొంతవరకు సహాయం చెయ్యగలను."

అత్యానందంతో అపరిచిత వ్యక్తి చెయ్యికందేటట్లు తపీలుమని చేతితో చెయ్యి వేశాడు. ఆ చప్పుడికి పక్కనే కూర్చుని కునికిపాట్లు పడుతూన్న 'జిన్నాగోత్రీకుడు' గడ్డం సవరించుకోవడం, అతన్ని ఆనుకున్న అరవ విశ్వస్త ముసుగు సవరించుకోవడం ఒకేసారి జరిగింది.

"అయితే మీరలా లోపలికి రండి" గొప్ప సలహా యిచ్చాడు! అయనుంటే మంగలినైనా పిలుచు నన్నట్లుంది వ్యవహారం! లోపలికి రాగలుగితే నాకు చేసేదేముంది గుడ్డి సహాయం!

"అలాజరగడానికిసుతరామూ వీల్లేదు. కనకనే ఈ తిప్పలు" అన్నాడు చిరాకుతో వెంకటేశం.

"మానవునకు శాంతం ఉండాలి. తొందరపడడంవల్ల పనులు కావన్న సంగతి ఇంకా ఇప్పటి కుర్రకారుకి తెలియదు" అన్నాడు గడ్డం మాసిన వ్యక్తి.

ఇలాంటి వేదాంతులతో లావాదేవీలు పడి, విలువైన కాలాన్ని పాడుచేయడం వెంకటేశానికి నచ్చలేదు. విలువైనకాలం! బండిలో చోటు వెతుక్కోవడం విలువైన పని కాబోలు! అవును మరి! రోజులు అలా అఘోరించాయి. ఏం చేస్తాం?

"టైం అయిపోతూంది. మార్గం ఏదో చూపించండి త్వరగా!"

"ఏం తొందర్లేదు. ఇంకా పావుగంట వ్యవధి ఉంది. ఆ హోల్డాల్ యిలా యిచ్చి కిటికీలోంచి దూరి రండి"

నుదుటి రాత! కిటికీలోంచి దొంగలాగ దూరే యోగం పట్టింది వెంకటేశానికి! ఆ సమయంలో మరో తెలిసిన వ్యక్తి ఎవరైనా ఉంటే, ఆ దృశ్యాన్ని చిత్రంతో పేపర్లోకి ఎక్కించేవాడేమో.

బ్రహ్మాండంమీద వెంకటేశం తన దేహాన్ని కిటికీలోంచి బండిలోకి చేర్చాడు. కాని ఇకముందు? ఉదయం అయిదు గంటలవరకు అలా నిలబడవలసిందే. తనిలా ప్రయాణంలో డీలా అయిపోయి వెడితే శారద మనస్సు ఎంత బాధపడుతుందో?

"అయితే ఇలా నుంచోవలసినందేనాండి?"

"అదే ఆలోచిస్తున్నాను."

"ఏదో ఆ ఉపకారంకూడా తమరే చేసి, పుణ్యం కట్టుకోండి." ఎంత వినయం, ఎంత భక్తి.

"ఇంతకూ తమరు వెళ్లే పని?"

"పెళ్లి వ్యవహారం"

"ఎవరిది?"

"స్వంతం"